

విల్లు ఎక్కుపెట్టిన పోటీదారులు



క్రీడాకారులు వేసిన బాణాలు



ఫలితం తెలుసుకొంటున్న బాలబాలికలు

# ఏకాగ్రతతో లక్ష్యం చేరువ

## ఆసక్తికరంగా దక్షిణభారత అంతర కళాశాలల విలువిద్య పోటీలు

**బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే:** శేషాద్రిపురం ఈవినింగ్ డిగ్రీ కళాశాల 'రిపబ్లిక్ డేకప్' కోసం నిర్వహించిన దక్షిణ భారత అంతర పాఠశాల, అంతర కళాశాలల విలువిద్య (ఆర్చరీ) పోటీల్లో వివిధ వయోవిభాగాల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం గాంధీనగర బెంగళూరు కేంద్రీయ విశ్వవిద్యాలయం మైదానంలో జరిగిన ఈ పోటీలో ఆతిథ్య కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, పాండిచ్చేరి, గోవా నుంచి 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటారు. వేర్వేరు వయో విభాగాల్లో తమిళనాడు క్రీడాకారులు పైచేయి సాధించారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఏకాగ్రత మనిషిని లక్ష్యానికి చేరువ చేస్తుందని క్రీడాకారులకు హితవు పలికారు.

### విజేతలు వీరే..

అండర్-14 బాలుర విభాగం ఇండియన్ రౌండ్‌లో తమిళనాడు శ్రీరామ్ ఆర్చరీ అకాడమీకి చెందిన ఏఎస్ సేతురాజ్, ఏ.ఎస్.నవీనస్ తొలి రెండు స్థానాల్లో నిలవగా, తమిళనాడు ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన ఆర్.మౌళి మూడోస్థానంతో సరిపెట్టుకున్నాడు. బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన పూజా వైశాలీ, ఎస్.అర్షిత (ధ్యాన్‌చంద్ అకాడమి) తొలి రెండు స్థానాలు సాధించగా, బీఎస్ఎం స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఆనందశ్రీ (కర్ణాటక) మూడో స్థానం దక్కించుకొంది. అండర్-11 బాలుర విభాగంలో తమిళనాడుకు చెందిన హరిప్రసాద్ తొలి, తరుణ్ ప్రణవ్ మూడో స్థానం, (ధ్యాన్‌చంద్ అకాడమి), యతిన్ (ప్యూచన్ ఆర్చరీ అకాడమి) రెండో స్థానం సాధించారు. బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన రిధిన్య (ధ్యాన్‌చంద్ అకాడమి) ఎఫ్‌సీ.ఆషిక (శ్రీరామ్ ఆర్చరీ అకాడమి) తొలి రెండు స్థానాల్లో నిలవగా, జాస్విశ్రీ (శ్రీరామ్ ఆర్చరీ అకాడమి) మూడోస్థానంతో సరిపెట్టుకొంది.



సెంట్రల్ లైబ్రరీ ఎదుట కొనసాగుతున్న సైకిల్ ర్యాలీ



విధానసౌధ ఎదుట ఔత్సాహికులు

# ఇంధన పొదుపు పాటిద్దాం

## ఉత్సాహంగా కొనసాగిన సైకిల్ ర్యాలీ

**బెంగళూరు (ఎలక్ట్రానిక్ సిటీ, క్రీడలు), న్యూస్‌టుడే:** ఇందన పొదుపు, పరిసర సంరక్షణపై ప్రజల్లో జాగృతి కల్పించే కార్యక్రమం ఆదివారం కంఠీరవ క్రీడాంగణంలో జరిగింది. యూనివర్సిటీ సెంట్రల్ పెట్రోలియం నేతృత్వంలో పెట్రోలియం కన్సర్వేటివ్ రీసెర్చ్ సంస్థ (బెంగళూరు) నిర్వహించిన ఐదు కిలోమీటర్ల సైక్లోథాన్ కార్యక్రమంలో మూడువేల మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఇంధనం పొదుపు, పర్యావరణ సంరక్షణ నినాదాలతో స్టేడియం చుట్టూ సైకిల్ తొక్కుతూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఆతిథ్య గెయిల్ (గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) అధికారి పి.మురుగేషన్ మాట్లాడుతూ పెట్రోలియం వాడకంలో నియంత్రణ పొందేందుకు సైకిల్ వినియోగం పెరగాలన్నారు. నడక, సైకిల్ తొక్కడంతో చక్కని ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. అనంతరం నిర్వాహకులు లక్కీ డ్రా ద్వారా పది మంది ఔత్సాహికులను ఎంపిక చేసి సైకిళ్లను బహుమతిగా అందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ సైక్లోథాన్‌ను ప్రారంభించారు.



కంఠీరవలో పరుగు సందడి



కబ్బన్‌రోడ్డులో ఔత్సాహికులు

# మూకాంబికా సన్నిధిలో రాఘువేంద్ర రాజ్‌కుమార్

**ఉడుపి, న్యూస్‌టుడే:** కన్నడ కంఠీరవుడు డాక్టర్ రాజ్‌కుమార్ తనయుడు రాఘవేంద్ర రాజ్‌కుమార్ శనివారం జిల్లాలోని కొల్లూరు మూకాంబికను దర్శించుకున్నారు. భార్య మంగళతో కలిసి ఆయన కొల్లూరు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న త్రయంకం సినిమా చిత్రీకరణ ఉడుపి పరిసరాల్లో కొనసాగుతోంది. ఇందులో రోహిత్, అనుపమ జంటగా నటిస్తున్నారు.



# ఉక్కు వంతెన ఆలోచన సరికాదు

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** నగరంలో వాహన రద్దీ నియంత్రణకు ఉక్కు వంతెనల నిర్మాణం పరిష్కారం కాదని భారతీయ విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్త డా.టి.వి.రామచంద్ర స్పష్టం చేశారు. బాహ్య, అంతర్ వలయ వర్తుల రహదారుల నిర్మాణం, ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, నగరంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న రైలు మార్గాల్లో సబర్బన్ రైళ్లను నడపడం, కూడళ్లలో మినీ వంతెనలు, బిల మార్గాల నిర్మాణంతో సమస్య అదుపులోకి వస్తుందని చెప్పారు. 'బెంగళూరును కాపాడండి' సమితి ఆదివారం ఇక్కడ నిర్వహించిన నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో దశలవారీగా 101.5 కి.మీ. ఉక్కు వంతెనల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం యోచించడం మూర్ఖత్వమేనని అన్నారు. హెబ్బాళ నుంచి రాజ్‌భవన్ వరకు రూ.33 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాల్సి వస్తే, దానికి పది వేల చెట్లను నరికి వేయవలసి ఉంటుందని వివరించారు. నగరంలో కొత్త పరిశ్రమలకు, కంపెనీలకు అనుమతులు ఇవ్వకుండా శివారు ప్రాంతాలు, ఇతర నగరాలకు తరలించాలని సూచించారు. నగరంలోని వాహనాల సంఖ్యలో 65 శాతం బైకులదేనని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే నగరంలో 2031 నాటికి వాహనాల సంఖ్య 2 కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. నిపుణులతో చర్చించకుండా ప్రాజెక్టులను నిర్మిస్తే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. ఈ సమావేశంలో వివిధ సంస్థల ఆచార్యులు డా.ఆశిశ్ వర్మ, ఆచార్య గోవిందరాజు, నాగేశ్ హెగ్డే తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో డా.ఆశిశ్ వర్మ, డా.టి.వి.రామచంద్ర, నాగేశ్ హెగ్డే తదితరులు

ఈనాడు
దినపత్రిక కావలసిన వారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
బళ్లారి: 9945050116
గంగావతి: 9986135572
మైసూరు: 9972513020
బెంగళూరు: 9980300297
ఫోన్: 080-25599686
ఫ్యాక్స్: 080-25588088,
న్యూస్: 9972513029

దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు మీ దగ్గరలోని **ఈనాడు ఏజెంట్**ను లేదా క్రింది ఫోన్ నెంబర్లును సంప్రదించగలరు.
బళ్లారి: 08790826054,
09963552619
07032975409

ప్రియమైన పాఠకులారా! కర్ణాటక మినీపై మీ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అందజేయగలరు. మీ ప్రాంత సమస్యలనూ తెలియజేయగలరు. మా మెయిల్ ఐడీ: karnatakadesk@eenadu.net

# ప్రేమతో నిస్వార్థ వైద్యసేవలు

▼ 14.15 లక్షల మంది రోగులకు మేలు ▼ ఏటా రూ.83 కోట్ల వ్యయం

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** నిరుపేద రోగులకు ప్రేమతో ఆధునిక వైద్య సేవలందిస్తున్నామని..సత్యసాయి ఆశయ సాధనలో భాగస్వాములైనందుకు ఎంతో సంతోషంగా ఉందని వైట్‌ఫీల్డ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ సుందరేశన్ పేర్కొన్నారు. ఆదివారం సాయికుల్వంత్ మందిరంలో బెంగళూరు వైట్‌ఫీల్డ్ సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి 18వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రసంగిస్తూ మానవీయతను ప్రతిబింబించేలా సత్యసాయి వైద్యసేవలు రోగులకు కొనసాగుతున్నాయన్నారు. ధనిక పేద అనే తారతమ్యం లేకుండా ఉచితంగా ఏకీకృత సేవలను అందిస్తూ సత్యసాయి హెల్త్‌కేర్ మిషన్ లక్ష్యాలను పాటిస్తున్నామన్నారు. ప్రేమతో అందించే సేవలు జగతికి ఆదర్శమన్నారు. సత్యసాయి ఆసుపత్రి 2001లో ప్రారంభమైందని ఇప్పటి వరకు 14.15 లక్షల మందికి వైద్య సేవలందించామని చెప్పారు. ఏటా రోగులకు రూ.83 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు ప్రేమతో సేవలందిస్తున్నారన్నారు. సత్యసాయి సేవాదళ్ విధానం చక్కటి సేవలకు దోహదపడుతోందన్నారు. వైద్య విద్యార్థులు పరిశోధన, దేశీయంగా స్వచ్ఛందసేవతో వైద్యులు అందిస్తున్న సహకారం రోగులకు మెరుగైన సేవలు అందించడానికి తోడ్పడుతోందన్నారు. ఇప్పటి వరకు హృద్రోగ విభాగంలో 49,980, న్యూరోసర్జన్ 37,081, న్యూరాలజీ 13,745 శస్త్ర చికిత్సలతో పాటు లక్షలాది మందికి పరిశోధన పరీక్షలు నిర్వహించామన్నారు. 2018లో హృద్రోగం 1708, న్యూరాలజీల్లో 2370 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించి, 119 మందికి పేస్‌మేకర్ అమర్చామని పేర్కొన్నారు. 2001 నుంచి ఇప్పటి వరకు 63,402 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించామని, 2016లో సత్యసాయి జనరల్ ఆసుపత్రిని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోకి విలీనం చేశామని తెలిపారు సత్యసాయితో ఉన్న అనుబంధం, స్ఫూర్తితో రోగులకు ప్రేమతో అందిస్తున్న వైద్యసేవలను వైద్యులు వివరించారు. త్యాగమైన భవంతో అమృతత్వాన్ని మనస్సులో నింపుకొని రోగులకు వైద్యసేవలందించాలనే సందేశాన్ని తెలియజేస్తూ..సాయి భక్తిగీతాలను వైద్యులు, వైద్యసిబ్బంది శ్రావ్యంగా ఆలపించారు.



వైద్యులు, సిబ్బంది కచేరీ

వేడుక ఏదైనా వేదిక ఒక్కటే...
పుట్టినరోజు, వివాహము, పదవీ విరమణ వంటి శుభసందర్భాలకు ఈనాడు లో తక్కువ ఖర్చుతో యాడ్స్ ఇవ్వండి.
మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబసభ్యుల / ఆత్మీయుల శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతి యాడ్స్ ఈనాడులో తక్కువ ఖర్చుకే
పూర్తి వివరాలకు సంప్రదించండి:
బెంగుళూరు: హోసూరు: 9121167527
బళ్ళారి : 9121167525
గంగావతి : 9121167526
జి.ఎస్.టి. 5% అదనం

© 2019 all rights reserved